
# ఆలస్యం అమృతం..

కథ

వాణిశ్రీ

'ఆలస్యం అమృతం విషం' అని పెద్దలు ఎందుకన్నారో? పాతకోట నరసింహా రావు చెప్పిన సంగతి విన్న తర్వాత అర్థమైంది. వాడిపేరు పాతగా ఉన్నా మనిషి మోడ్రనే. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నాకు హైస్కూల్లో క్లాస్‌మేట్. ఇంటర్‌లో విడిపోయాం. మళ్ళీ శంకర్ సొల్యూషన్స్ కంపెనీలో కలుసుకున్నాం.

అప్పట్లో వాడు బుద్ధావతారం. బ్యాక్ బెంచీలో కూర్చునేవారు. పాఠాలు చదవ డంలో ముందుండేవాడు. ఐతే ఏదో మొహమాటం. ముందు కూర్చుంటే మాష్టారు ఏం అడుగుతాడో అని భయం. తెలిసింది చెప్పడానికి కూడా తడబడే వాడు. బ్యాక్ బెంచీలో నేను వాడి బెంచీమేట్‌ని. నా సంగతి వేరు. నాది అల్లరి బ్యాచ్.



బుద్ధావతారం గాడు ఏం మారలేదని నేనీ సంవత్సరం సాహచర్యంలో కనిపెట్టేశాను.

''ఐ లవ్ అమృతరా!'' అని నా చెవుల్లో గుసగుసలాడాడు.

''ఎప్పట్నుంచీ?'' అని ఆశ్చర్యంగా అడిగాను.

అమ్మాయిలంటే ఆమడదూరం పరిగెత్తే ఈ బుద్ధావతారం గాడు 'లవ్' చెయ్యడం గూడానా?

''సిన్స్ వన్ ఇయర్!'' అన్నాడు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ.

''సంవత్సరం నుంచీ ప్రేమిస్తున్నావా? మరి చెప్పావా?''

తల అడ్డంగా గంగిరెద్దులా ఊపాడు.

''నీకు చెప్తున్నా!'' అన్నాడు.

''నాకు చెప్పడం ఏంట్రా నీ బొంద? అమృతను లవ్‌చేస్తుంటే అమృతకు చెప్పాలిగాని....'' అని చీవాట్లు వేశాను.

''ఐకాంట్. నువ్వే చెప్పాలి'' అన్నాడు.

''ఏంటీ నువ్వు అమృతను ప్రేమిస్తుంటే నేనెళ్లి 'అమృతా! నిన్ను ఆ పిఎన్. రావు గాడు లవ్ చేస్తున్నాడు. నువ్వూ వాడిని లవ్ చెయ్యి అని చెప్పనా?' నాన్సెన్స్. నీ కంటికి నేను బ్రోకర్‌గాడిలా కనిపిస్తున్నానా?'' అని తిట్టాను.

''అదికాదురా! ఇంట్లో పెళ్లి, పెళ్లి అని చంపుతున్నారు. ఎవరో తెలియని అమ్మాయిని చేసుకునే కంటే తెలిసిన అమృతని పెళ్లి చేసుకుంటే బాగుంటుంది కదా! నువ్వీ పెళ్ళిచెయ్యాలి'' అన్నాడు.

''ఒకే ఆఫీసులో పనిచేస్తూన్న అమ్మాయితో 'ఐ లవ్ యూ' నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను అని చెప్పలేని వాడివి నువ్వెందుకు పనికొస్తావురా వెధవా! నువ్వసలు తెలుగు సినిమాలు చూస్తున్నావా? టెన్త్‌క్లాసు నుంచే లవ్ చేసుకునే సినిమాలు ఎన్ని రావడం లేదూ? వాటిని చూసైనా బుద్ధి తెచ్చుకోరాదూ. పెళ్లికేం తొందర? పెళ్లయ్యాక అన్నీ కష్టాలే గదా? కొన్నాళ్ళు ప్రేమించిన అమ్మాయితో సినిమాలు, షికార్లు తిరుగుతూ అందరి మాదిరే డేటింగ్ చెయ్యొచ్చుగా''

''సర్లేరా! అవన్నీ నా వల్లకాదు. అమృతంటే నాకు ఇష్టం. ఆ అమ్మాయి మంచిది. నాకు నచ్చింది. నువ్వు మాట్లాడి పెళ్లిచేయాలి'' అని తన సీట్లోకి వెళ్లిపోయాడు పాతకోటగాడు.

వాడి సంగతి తెలిసీ, వాడిని మార్చాలని ప్రయత్నించడం నాదే బుద్ధి తక్కువని గ్రహించి నేరుగా రంగంలోకి దిగిపోయాను.

అమృత దగ్గరికెళ్లి ''అమృతా! కంగ్రాట్స్!'' అన్నాను.

నేరుగా చెప్పకుండా అమృతని తికమకపెట్టాలని నా ఉద్దేశ్యం. కంగ్రాట్స్ చెప్తే ఎందుకని అడుగుతుంది కదా? అప్పుడు పాతకోటగాడు నిన్ను లవ్ చేస్తున్నాడని చెప్పి వాడి గురించి గొప్పగా చెప్పాలని ఐడియా వేశాను.

''మీకెవరు చెప్పారు? ఎలా తెలిసింది?'' అని ఆశ్చర్యపోతూ అడిగింది అమృత.

నేను బిత్తరపోయాను. అర్థం లేదు గాని నా మొఖం పెనం మీద మాడిన పెసరట్టయి పోయి ఉంటుంది. నేను చెప్పిందేమిటి? తను అన్నదేమిటో అర్థంకాక అయోమయంలో పడిపోయాను. ఒకవేళ పాతకోటగాడు నాకు చెప్పినట్టే వేరే ఇంకెవరికైనా అమృతను మేనేజ్ చెయ్యమని దేబిరించి ఉంటారా! వాళ్లిపాటికే అమృతకు విషయం చేరవేసి ఉంటారా? అని అనుమానం వచ్చింది.

ఏడవలేక నవ్వుతూ ''ఎలాగో తెలిసిందిలే'' అన్నాను.

''ఎంగేజ్‌మెంట్ తాజ్‌కృష్ణాలో. కార్డులు ప్రింటవుతున్నాయి. మన వాళ్లందరికీ అప్పుడే పార్టీ. ముందుగా ఏ పార్టీ ఇవ్వను'' అన్నది అమృత ముసిముసి నవ్వులు నవ్వుతూ.

'అప్పుడే ఎంగేజ్‌మెంట్, కార్డులు ప్రింటవడం దాకా వెళ్లిందా? ఇందులో ఏదో తిరకాసు ఉందని డౌట్ వచ్చింది. సమ్‌థింగ్ ఈజ్ రాంగ్'

''లవ్వా?'' అని ఒక రాయి విసిరాను.

రాయి తగిలింది.

''లవ్వా పాడా? అరేంజ్డ్ మ్యారేజీనే. అతను ఇన్ఫోసిస్‌లో జాబ్ చేస్తున్నాడు బెంగుళూరు'' అంది అమృత.

ఆలస్యం అమృతం విషమే. నాక్కాదు పాతకోటగాడికి. అమృతకు పెళ్లి కుదిరిన సంగతి తెలిసి వాడు కృంగి కృశించి, నశించి....పాపం అనిపించింది.

''ఔనూ! నాదో డౌట్. కార్డ్స్ ప్రింటయ్యేవరకూ ఎవరికీ చెప్పగూడదనుకున్నాను. మీకెలా తెలిసింది?'' అంది.

''అదే మన టాలెంట్'' అని వెర్రినవ్వొకటి నవ్వాను.

తర్వాత పాత కోటగాడిని పట్టుకుని వాయించేశాను. ఏరోజు పని ఆ రోజే చెయ్యాలిరా వెధవాయ్. ఏ పనీ వాయిదా వేయకూడదు. సరే! అమృతకి ఎలాగూ పెళ్ళయిపోతోంది. ఇంకెవరైనా నచ్చితే ముందుగా చెప్పేడువు. ఆఫీసులో ఇంకా చాలా మంది అమ్మాయిలు ఉన్నారు. 'డేటింగ్‌కి పిలిచే వారుంటే పలికేను నేను' అని ఎదురుచూసేవాళ్ళుంటారు. అంజలీ. రమ్య, శ్రావణి, సుజ్జీ, బజ్జీ.... అని ఏను అంటుండగానే పాతకోటగాడు కోపంతోనో, బాధతోనో, ఏడుపుతోనో చర చరా వెళ్లిపోయాడు.

* * *

అమృత పెళ్లి గుంటూరులో. పెళ్లికొడుకు తరపు వాళ్ళు పెళ్లి హైదరాబాద్‌లో చెయ్యమని అడిగితే అమృత తండ్రి సామర్లకోట రంగయ్య అడ్డం తిరిగాడు. పెళ్లి మా ఊళ్ళో చేస్తాం. చుట్టాలంతా ఇక్కడే ఉన్నారు. మీకంతగా పెళ్లి హైదరాబాద్‌లో జరగాలని ఉంటే అక్కడ ఖర్చులన్నీ మీవే. పెళ్లి సమయానికి మేరేజ్ హాలుకి వస్తాం అని ఢంకా బజాయించి చెప్పేశాడు. పెళ్లికొడుకు తండ్రి పీనాసి పుల్లయ్యనుకుంటాను వెనక్కి తగ్గేడు.

సరే మా స్టాఫంతా బస్సొకటి మాట్లాడుకుని గుంటూరు వెళ్ళడానికి రెడీ అయ్యాం.

అంతా వచ్చారు. పాతకోటగాడు అడ్రస్ లేడు. సెల్‌ఫోన్ ఆఫ్ చేసి ఉంది. నాకు పరిస్థితి అర్థమైపోయింది. వాడు అమృత పెళ్లికి రాదల్చుకోలేదు. తను ప్రేమించిన అమృత మెడలో ఎవడో కోన్‌కిస్కాగొట్టంగాడు తాళి కడుతుంటే చూసి తట్టుకోలేననుకున్నాడేమో! సినిమాల్లో అక్కినేనిలా తను అంత బరువైన త్యాగి పాత్ర పోషించలేనని డౌట్ పడ్డాడేమో! నేను మాత్రం వాడిని వదలదలుచుకోలేదు. సంవత్సరం పాటు ప్రేమిస్తూ అమ్మాయికి 'ఐ లవ్ యూ' చెప్పడం చేత గాని బడుద్ధాయికి, ఆమె పెళ్లి చూపించడమే శిక్ష అని నా విశ్వాసం.

మేం బయల్దేరిన స్పెషల్ బస్సు వాడింటి ముందు ఆపించి బలవంతం చేసి బస్ ఎక్కించాను. వాడి ఏడుపు ముఖం చూసి క్రూరంగా నవ్వుకున్నా.

మేం ముందుగానే అరేంజ్ చేసుకున్నట్లు సింహపురి హోటల్లో ఎసి రూమ్స్‌లో దిగి స్నానాలు చేసి పెళ్లికి రెడీ అయ్యాం. పెళ్లి డోగిపర్తి సుబ్బారావు కళ్యాణ మండపంలో. మా హోటల్‌కి దగ్గరే అని చెప్తే నడిచే బయల్దేరాం.

పెళ్లి అర్ధరాత్రి పన్నెండు, ముప్పై మూడు నిముషాలకు. మేం ఎనిమిదింటికే మ్యారేజ్‌హాల్‌కి చేరుకున్నాం. పెళ్లి ఎప్పుడైనా డిన్నర్ సమయానికి చెయ్యాలి గదా!

పెళ్లి డిన్నర్‌లో నాన్ వెజ్ లేదని పెదవి విరిచి కొందరు కొలీగ్స్ దగ్గర్లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్స్‌లోకి బ్యాచీల వారీగా వెళ్లిపోయారు.

ఆంధ్రా పెళ్లిళ్లలో నాన్‌వెజ్ ఉండదురా బాబూ! వుండ్రా నాయనల్లారా! అని మొత్తుకుంటున్నా వినకుండా మందుబాబులు అదోక వంక బెట్టుకుని పోలోమంటూ పోయారు. రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పలేదనట్లు పెళ్లిలో కూడా మందేంటిరా! తాగి తూలుతుంటే ఏం బాగుంటుంది. తాగేదేదో హైదరాబాద్ పోయాక తాగి చావొచ్చు కదా! అంటే ఆ కక్కుర్తి గాళ్ళు వింటేనా?

సరే పోయేవాళ్లతో పోలేక మేం డిన్నర్ చేసి కుర్చీల్లో కూలబడ్డాం. టైం ఇంకా ఎనిమిదిన్నరే.

అసలు కథ ఇప్పుడే మొదలైంది.

బ్యాండ్ మేళాలు మ్రోగుతుంటే పెళ్లికొడుకు వచ్చాడని అర్థమైంది. గేటు దగ్గరే బ్యాండ్‌తో పాటు అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఏంటో గొడవ అని అక్కడికెళ్లాం.

అమృత తండ్రి సామర్లకోట రంగయ్య మీద, పెళ్లికొడుకు తండ్రి, అతగాడి బావట. ఇద్దరూ జాయింట్‌గా కేకలేస్తున్నారు.

''మీ వాళ్లందరికీ హోటల్లో ఎసి రూమ్‌లా! మాకు మునిసిపాలిటీ గెస్ట్‌హౌస్‌లో డర్టీ రూంలా?'' అని పెళ్లికొడుకు బావ అరుస్తున్నాడు.

కొందరు కేకలేస్తున్నారు, మరికొందరు సముదాయిస్తున్నారు.

''ఒక పూట సర్దుకోడానికి ఏదైతే ఏంటట....!' అని పెళ్లికూతురు బంధువులు సణుక్కుంటున్నారు.

''నేనెవరికీ హోటల్లో రూంలు ఇవ్వలేదు. వాళ్ళే దిగారు'' అని సామర్లకోట మొత్తుకుంటున్నాడు.

''పెళ్లి హైదరాబాద్‌లో చెయ్యమంటే గుంటూర్లోనే అని పట్టుబట్టాడు. ఇక్కడ వేడి మంటెక్కు

తోంది. పెళ్లివారికి ఏసీ రూం ఇవ్వాలని జ్ఞానం లేదా?'' అని పెళ్లికొడుకు అక్క గణాచారి మాదిరి గంతులేస్తోంది.

అదన్నమాట అసలు సంగతి.

కాసేపటికి ఆ గొడవ సద్దుమణిగింది. ఆకలేసిందేమో! అంతా భోజనాల హాల్లోకి వెళ్లిపోయారు.

ఆ తర్వాత పెళ్లికొడుకు తండ్రి వీరంగం వేస్తున్నాడు.

''మా వాడికి ముష్టిమారుతీ కారా ఇచ్చేది? అవసరం లేదు. కనీసం ఇండికా ఇవ్వాల్సిందే'' అంటున్నాడు.

''నేను కారు ఇస్తానన్నాను కానీ ఇండికా అని చెప్పలేదు. పదిలక్షలు కట్నం పుచ్చుకున్నారు. మీ ఇష్టం వచ్చింది కొనుక్కోండి'' అని సామర్లకోట రంగయ్య గట్టిగా అన్నాడు.

అంతా కేకలు. గందరగోళం. అటొక గుంపు, ఇటొక గుంపు. కొంచెం ముదిరితే ఇరుపక్షాల వాళ్ళూ కొట్టుకుంటారేమోనని అనుమానం వచ్చింది. కథ అంతవరకూ వచ్చేదేమో! పెళ్లికూతురు అమృత రంగ ప్రవేశం చేసింది.

''నాన్నా! పెళ్లికి ముందే ఇంత గందరగోళం చేస్తున్నారు. రకరకాల డిమాండ్స్ పెడుతున్నారు. పెళ్ళయిన తర్వాత ఇంకెంత చేస్తారో? చూస్తే శాడిస్ట్లా ఉన్నారు. నేనీ పెళ్లిచేసుకోను'' అంది.

పెళ్లి కొడుకు తండ్రి ఇంకా రెచ్చిపోయాడు.

''పీటల మీద పెళ్లి ఆగిపోతే ఈ జన్మలో పెళ్లి కాదు. ఏమనుకుంటున్నావో? సంపాదిస్తున్నానని గర్వం కాబోలు నీకు'' అంటూ అమృత మీద ఎగిరాడు.

''పెళ్లికాకపోయినా ఫర్వాలేదు. మీలాంటి శాడిస్టల కుటుంబంతో సంబంధం వద్దే వద్దు'' అంది అమృత.

టీవీలో లైవ్షో చూస్తున్నట్లుగా ఉంది మాకు. ఈలోగా మా కొలీగ్స్ బార్లో మందుకొట్టి వచ్చిన వాళ్ళు కథలోకి ప్రవేశించి అమృతను ఎక్కేశారు. సామర్లకోట రంగయ్య కూడా తెగించి ''ఏమనుకుంటున్నారో నేను తల్చుకుంటే మీరు గుంటూరు పొలిమేర దాటలేరు. చంపి ఇక్కడే పాతేస్తా'' అని తాండ్రపాపారాయుడిలా తొడగొట్టి విరుచుకుపడ్డాడు.

''అరేయ్! మన పాత గుంటూరోళ్లనీ, సంగడిగుంట బ్యాచ్నీ పిలవండిరా. వీళ్ల అంతు తేలుస్తాను'' అన్నాడు.

పెళ్లికుదిర్చిన మధ్యవర్తిని పట్టుకుని ''నేనిచ్చిన కట్నం డబ్బు పదిలక్షలు. పెళ్లి ఖర్చులు ఐదు లక్షలు వెంటనే ఇచ్చి కదలమను. లేకపోతే వాళ్లతో బాటు నిన్నూ పాతేస్తాను'' అన్నాడు.

మధ్యవర్తి బెంబేలెత్తి సామర్లకోట కాళ్లు పట్టుకుని డబ్బు ఇప్పించే పూచీనాది అని అక్కడ్నుంచి పరుగులంకించుకున్నాడు.

పెళ్లి ఆగిపోయింది. బ్యాండ్మేళాలు మూగవోయాయి.

కారణం ఏదైనా పెళ్లి ఆగిపోతే పెళ్లికూతురు పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది? కామెడీ సినిమా కాస్త ట్రాజెడీ సినిమాలా మారిపోతుంది.

పెళ్లికూతురు తల్లి భోరున ఏడుస్తూ ఉంటే బంధువులు ఓదారుస్తున్నారు.

''అమృతకేవమ్మా! చక్కని చుక్క. సంపాదిస్తోంది. వీడి తాతలాంటి సంబంధం కుదురుతుంది'' అని అనునయవాక్యాలు వల్లిస్తున్నారు.

అమృత బిక్కమొహం వేసుకుని కూర్చుంది. సామర్లకోట రంగయ్య ముఖం గంభీరంగా మారిపోయింది. లోలోపల ఎంత బాధపడుతున్నాడో!

నా పాత్ర ఏమిటో అర్థమైంది.

పాత కోటగాడిని పక్కకు తీస్కెళ్లి చెప్పాను.

''ఒరేయ్ బడుద్దాయ్! నువ్వు ప్రేమిస్తున్న అమృత నీకు దక్కాలంటే ఇదే ఛాన్స్. వెళ్లి అమ్మతను ఓదార్చు. ఇదే ముహూర్తానికి పెళ్లి చేసుకుంటానని చెప్పు. కష్టంలో ఉన్న ఆడది వెంటనే కరిగిపోతుంది. ఎంతో సంతోషిస్తుంది. ఇక నిన్ను దేవుడిలా నెత్తిన పెట్టుకుంటుంది''

వాడు గాబరాపడిపోయి ''నేనా...?'' అన్నాడు.

''వెధవా! నువ్వు కాకపోతే నేనా? నాకు ఆల్రెడీ పెళ్లయిపోయింది'' అన్నాను సీరియస్గా.

వాడు కొంచెం సేపు ఆలోచించి ''మా నాన్న ఏమంటాడోరా!'' అని సందేహం వెలిబుచ్చాడు.

''నీ ఇష్టం. ఆలస్యం అమృతం విషం'' అని బెదిరించాను.

''ఇప్పటికిప్పుడు పెళ్లి చేసుకుంటానంటే ఏమంటాడో? తర్వాత మరో ముహూర్తానికి ఐతే బాగుంటుంది'' అన్నాడు.

ఈ బ్యాక్ బెంచీగాడి బుద్ధి నాకు చిన్నప్పటి నుంచీ తెలుసుగదా. వాడు చొరవ తీసుకోలేదు.

''పోనీ మీ నాన్నతో నేను మాట్లాడనా?'' అన్నాను.

వాడి ముఖం వికసించింది.

సంతోషంతో సెల్ తీసి బటన్ నొక్కి ''రింగవుతోంది. మాట్లాడు'' అని నా చేతిలో పెట్టాడు.

''హలో ఎవరూ?''

''నేను అంకుల్. గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను'' అని మొదలుపెట్టి జరిగిందంతా చెప్పాను.

''అంకుల్! మరొక ముహూర్తమైతే అంతా వేస్టవుతుంది. ఇదే ముహూర్తానికైతే బాగుంటుంది. ఆ తర్వాత ఏమవుతుందో? మనవాడు సంవత్సరం నుంచీ అమృతను ప్రేమిస్తున్న సంగతి దాచి ఇంతవరకూ తెచ్చాడు. ఇప్పుడైతే అమృత పెళ్లికి ఒప్పుకుంటుందని నా నమ్మకం. ఆ తర్వాత ఎలా ఉంటుందో ఆమె మానసిక పరిస్థితి? మీరేమంటారు?''

''ఫోన్ వాడికివ్వు?'' అన్నాడు అంకుల్.

''అంకుల్ నీతో మాటాడతారట'' అని ఫోన్ పాతకోటగాడికి ఇచ్చాను.

''ఈ ముహూర్తానికే ఆ పిల్ల మెడలో తాళి కట్టు. ప్రతిదానికీ తాత్సారం చెయ్యడం నీకు అలవాటే. మేం రేపు ఇంటర్సిటీకి బయల్దేరివస్తాం. మీ అమ్మకు నేను నచ్చచెప్తాను. తర్వాత ఇక్కడ రిసెప్షన్ ఏర్పాటుచేసి మన బంధువుల్ని పిలుద్దాం. మా గురించి ఆలోచించకు''

అంకుల్ చెప్తున్న మాటలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి.

పాతకోటగాడు వాళ్ల నాన్న ఎదుట ఉన్నట్లే భావించి గంగిరెద్దులా తలఊపుతూ ''సరే నాన్నా! అట్లాగే నాన్నా! నువ్వు చెప్పినట్లే చేస్తాను నాన్నా!'' అంటున్నాడు.

ఇప్పుడు వాడి ముఖంలోకి వెలుగొచ్చింది అనడం కంటే పెళ్లి కళ వచ్చిందనడం సబబుగా ఉంటుంది. ఆనందం పట్టలేక ''థ్యాంక్యూరా! థ్యాంక్యూ వెరీమచ్'' అన్నాడు నన్ను అమాంతం కావులించుకుని.

''నాకు థ్యాంక్స్ చెప్పడం తర్వాత. ముందు అమృతకు అసలు సంగతి చెప్పు'' అన్నాను కసురుకుని.

వాడు మొద్దబ్బాయిలా అక్కడే నిల్చున్నాడు.

''వెళ్ళు....వెళ్ళు చెప్పు. అమృతా! దిగులుపడకు. ఇదే ముహూర్తానికి నిన్ను పెళ్లి చేసుకుంటాను అను'' అని చెప్పాను.

వాడు కదిల్తేనా?

''నువ్వెళ్ళి చెప్పరా....'' నంగిగా అన్నాడు.

''నేనెళ్ళి చెప్తే చెప్పుతో కొట్టుద్ది. నాకు ఆల్రెడీ పెళ్ళయ్యిందన్న సంగతి అమృతకి తెలుసు'' అన్నాను.

''అదికాదురా. నా సంగతి'' అని అడుగుతున్నాడు.

పెళ్లి ఆగిపోయిందని పెళ్లికి వచ్చిన బంధువులు ఒక్కొక్కరే జారుకుంటున్నారు.

ఇక నాకు తప్పేట్లు లేదు. పాతకోటగాడి చెయ్యి పుచ్చుకుని బరబరా లాక్కెళ్ళి అమృత ఉన్న గదిలోకి తీసికెళ్లాను. అమృత దిగులు కళ్ళతోటి దీనంగా చూసింది మా వైపు. మేం ఏదో ఓదార్చడానికి వచ్చామని అనుకుంటున్నది.

''అమృతా! దిగులుపడకు. ఇదుగో వీడు ఇదే ముహూర్తానికి నిన్ను పెళ్లిచేసుకుంటున్నాడు. ఈ బుద్ధావతారం గాడు సంవత్సరం నుంచీ నిన్ను సైడ్లవ్ చేస్తున్నాడు. ఈ విషయం నాకు తెలిసేసరికి నీ పెళ్లి ఫిక్సయిపోయింది. సమయం వచ్చింది కాబట్టి ఇప్పుడు బైట పెట్టాల్సి వచ్చింది. ఏమంటావు?'' అన్నాను.

అమృత ఏమంటుంది? సిగ్గుల మొగ్గయింది.

మేం అమృత దగ్గరికి వెళ్లడం చూసిన మా కొలీగ్స్ అంతా మా వెనుకే వచ్చి విషయమంతా విని పాతకోటగాడిని అమాంతం పైకెత్తి నెత్తినెక్కించుకుని గందరగోళం చేశారు.

పాతకోటను సామర్లకోట అమాంతం కౌగిలించుకుని ఆనందబాష్పాలు రాల్చాడు.

వాతావరణం ఒక్కసారిగా ఉత్సాహభరితమైపోయింది.

బ్యాండ్మేళాలు మ్రోగాయి. పురోహితుడు మంత్రాలు చదవడం మొదలుపెట్టాడు.

పాతకోటగాడిని అమ్మలక్కలు పెళ్లికొడుకుని చేశారు. బుద్ధూ ఆనందంతో అమృత మెడలో తాళి కట్టేశాడు.

*